## క్లుప్తంగా

### కేంద్ర మంత్రికి శుభాకాంక్షలు



బండి సంజయ్‌కి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపిన బూనేటి

పరిగి : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ప్రమాణస్వీకారం చేసిన బండి సంజయ్‌ని రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మారుతికిరణ్ బూనేటి మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఢిల్లీలోని కేంద్ర కార్యాలయంలో జాతీయ కిసాన్ మోర్చా కార్యదర్శి రాంనరేశ్ తివారీతో కలిసి పుష్పగుచ్ఛం శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలో ఎంపీగా గెలిచి కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ఉన్నారు.

### కొండాకు సన్మానం



విశ్వేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

పూడూరు: బీజేపీ చేవెళ్ల ఎంపీగా గెలుపొందిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని మంగళవారం మండల నాయకులు కలిశారు. ఈ సందర్భంగా సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేష్‌పటేల్, పూడూరు మండల పార్టీ అధ్యక్షుడు రాఘవేందర్, మండల నాయకులతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి బుధవారం తాండూరుకు వెళ్లే క్రమంలో మన్నేగూడ చౌరస్తాలో భారీ ఎత్తున సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో బీజేపి రాష్ట్ర నాయకులు సదానంద్‌రెడ్డి, వెంకటయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న తిరుపతిరెడ్డి

కొడంగల్ : మండలంలోని రుద్రారం గ్రామంలో జరిగిన రేణుకా ఎల్లమ్మతల్లి జాతరలో కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతిరెడ్డి మంగళవారం పాల్గొన్నారు. ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దేశ్‌ముఖ్, మాజీ సర్పంచులు వెంకట్‌రెడ్డి, సంజీవరెడ్డి, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు ప్రశాంత్, ఆనంద్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


### భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి



పూజల్లో పాల్గొన్న శ్రీనివాస్‌రెడ్డి

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని తాండూరు ఎమ్మెల్యే సోదరులు, ఆర్పీఎల్ కంపెనీ చైర్మన్ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో ఎల్లమ్మ తల్లి ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతోందన్నారు. అలాగే, వ్యక్తి మానసిక పరివర్తనలో మార్పు వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య, ఎంపీటీసీ రాంలాల్, శంకర్, రవి, ఆనంద్ పాల్గొన్నారు.

### గుండెపోటుతో జెడ్పీటీసీ మాజీ సభ్యుడి మృతి



బాయిరెడ్డి మోహన్‌రెడ్డి(ఫైల్)

దౌల్తాబాద్: మండల కేంద్రానికి చెందిన మాజీ జెడ్పీటీసీ బాయిరెడ్డి మోహన్‌రెడ్డి(65) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి విహారయాత్రకు వెళ్లారు. అయితే విశాఖపట్టణం సమీపంలో ఉన్న అరకులో మంగళవారం తెల్లవారజామున గుండెపోటు వచ్చింది. వెంటనే కుటుంబసభ్యులు సమీపంలో ఉన్న ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మోహన్‌రెడ్డి 40 సంవత్సరాలుగా పంచాయతీ అధ్యక్షుడిగా, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడిగా, ఎంపీపీగా, జెడ్పీటీసీగా వివిధ పదవులు నిర్వహించాడు. భార్య కొడంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నిర్వహించింది. మండలంలో మచ్చలేని నాయకుడిగా ముక్కుసూటిగా ఉండే మోహన్‌రెడ్డి మరణంతో మండలంలో విషాదం చోటుచేసుకుంది. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, మాజీఎమ్మెల్యేలు గురునాథ్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ మహిపాల్, ఎంపీపీలు విజయ్‌కుమార్, ముద్దప్పదేశ్‌ముఖ్‌లు సంతాపం ప్రకటించారు.

# సమస్యల స్వాగతం

- నేటి నుంచి ప్రారంభంకానున్న బడులు
- శిథిల భవనాలతో సమస్యలు
- ఇప్పటికే పూర్తయిన పుస్తకాల పంపిణీ



కొడంగల్ : శిథిలావస్థకు చేరిన పట్టణంలోని పాఠశాల

కొడంగల్ : మండల పరిధిలో 37 ప్రాథమిక, 10 ప్రాథమికోన్నత, 7 ఉన్నత, ఒక కస్తూర్బా, 4 గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల్లో 18 ఎస్జీటీ పోస్టులు, 4 ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం, 5 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 5 జీహెచ్ఎం, 13 స్కూల్ అసిస్టెంట్, 1 ఎల్పీ, 1 పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండలంలో 39 పాఠశాలలకు కంపౌండ్ వాల్ లేదు. 17 పాఠశాలలకు కంపౌండ్ వాల్ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. పట్టణంలోని కేంద్ర ప్రాథమిక బాలుర పాఠశాలలో తరగతి గదులు శిథిలావస్థకు చేరాయి. వర్షం వస్తే ఉరుస్తుంది. గది పైపెచ్చులు ఊడిపోతున్నాయి. పాఠశాలలో 110 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. మరుగుదొడ్లు దుర్గంధంగా ఉన్నాయి. నేటి నుంచి (బుధవారం) పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి**

కుల్కచర్ల: బడీడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించాలని మ్యాజిక్ బస్ సంస్థ కోఆర్డినేటర్లు అరవింద్, రఘులు కోరారు. మంగళవారం మండల పరిధిలోని రాంరెడ్డిపల్లి, ముజాహిద్‌పూర్ గ్రామాల్లో మ్యాజిక్ బస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో అన్ని వసతులు కల్పించడం జరిగిందని తెలిపారు. కావున, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి పరిశీలించి తమ పిల్లలను చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కరుణాకర్‌రెడ్డి, సంతోష్, ఉపాధ్యాయులు రాములు, వెంకటేశ్, వెంకటేశ్వర్లు, మ్యాజిక్ బస్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

**బంట్వారంలో..**

బంట్వారం: పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చదివించాలని ఎంఈఓ చంద్రప్ప అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన కోట్‌పల్లి మండల కేంద్రంలో ఇంటింటికి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రైవేటు స్కూళ్ల కంటే సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. మధ్యలో బడి మానేసిన పిల్లలను గుర్తించి చేర్పించాలన్నారు. పాఠశాలలు పున:ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులందరికీ పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేయాలన్నారు.

**మర్పల్లిలో..**

మర్పల్లి: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చురుకుగా కొనసాగుతోందని మండల విద్యాధికారి విద్యాసాగర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పుస్తకాలు, నోట్ బుక్స్‌ను తీసుకువెళ్లారని తెలిపారు. మండలంలో 12 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఆదర్శ పాఠశాల, ఎస్టీ ఆశ్రమ గురుకుల పాఠశాల, కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలు ఉండగా మరో 27 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయన్నారు. ఆయా పాఠశాలలకు 18 వేల పాఠ్యపుస్తకా లు, 22 వేలు నోట్‌బుక్స్ ప్రభుత్వం అందజేసిందని చెప్పారు. ఇప్పటికే 90 శాతం మేరకు పుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేశామన్నారు. మిగతా 10 శాతం బుధవారం అందజేయనున్నామని చెప్పారు.

**సమయపాలన పాటించాలి**

తాండూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలలు పున:ప్రారంభం కానున్నడడంతో ప్రతి ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయ పాలన పాటించాలని ఎంఈఓ వెంకటయ్య అన్నారు. మంగళవారం ఎంపీ డీఓ కార్యాలయంలో హెచ్ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ...వర్షాకాలం సందర్భంగా పాఠశాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని సూచించారు.మధ్యాహ్న భోజనం కల్తీకాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

**పరిగిలో..**

పరిగి : గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చేర్చేలా కృషి చేయాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని విద్యారణ్యపురిలో బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల నోడల్ అధికారి ఎం.గోపాల్‌తో కలసి ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. బడీడు పిల్లలందరిని బడిలో చేర్చేలా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతో పాటు అన్ని వసతులను కల్పిస్తుందని తెలిపారు.



కుల్కచర్ల: బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న మ్యాజిక్ బస్ సిబ్బంది, విద్యార్థులు



పరిగి: తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ



తాండూర్ రూరల్: మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటయ్య

# భగీరథ నల్లాకు ఆధార్‌లింక్ తప్పనిసరి

నల్లాలకు మోటార్లు పెడితే చర్యలు తప్పవు

దుద్యాల్ : గ్రామీణ ప్రాంతాల్లో నిత్యం తాగునీటి సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ నల్లాలకు ఇంటి యజమాని ఆధార్‌కార్డు నంబర్ లింక్ చేస్తున్నారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు మంగళవారం మండల కేంద్రం, మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు రమేశ్ రాథోడ్, కృష్ణవేణిలు ఇంటింటి సర్వే చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అక్రమ నల్లా కనెక్షన్లు ఉంటే వాటిని గుర్తించే అవకాశం ఉందన్నారు. అలాగే, ఒక ఇంటికి ఒకే నల్లా ఉండాలని తెలిపారు. సర్వేలో ఒక ఇంటికి రెండు కనెక్షన్లు ఉంటే వాటిని తొలగిస్తారని చెప్పారు. నీటిని సరఫరా చేసే సమయంలో నల్లాలకు బోరు మోటార్లు బిగించకుండా నీటిని వాడుకోవాలని సూచించారు.



హస్నాబాద్‌లో సర్వే చేస్తున్న పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి

# వీధి నాటకాలు చరిత్రను గుర్తుచేస్తాయి

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



కళాకారులను సన్మానిస్తున్న అనంతయ్య

దోమ : వీధినాటకాలు చరిత్రను గుర్తుచేస్తాయని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బాస్‌పల్లిలో గ్రామ కళాకారులు గత మూడు రోజులుగా కురుక్షేత్ర వీధినాటకాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ నాటకానికి అతను అందుబాటులో లేకపోవడంతో గ్రామ మాజీ సర్పంచ్ అనంతయ్యతో స్థానిక నేతల ద్వారా వీధి నాటకాలను వీక్షింపజేసి కళాకారులను శాలువాలతో సన్మానించారు. అనంతరం కళాకారులకు రూ. 20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీధి నాటకాలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు పురాతన కథలను మళ్లీ గుర్తు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు వెంకటయ్య, గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కేసులు

ఆర్డీఓ శ్రీనివాసరావు



బోర్డును పాతిన తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది

తాండూరు: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తాండూరు ఆర్డీఓ శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం మండల తహసీల్దార్ తారాసింగ్, ఆర్ఐ బాల్‌రాజ్‌లతో పాటు రెవెన్యూ సిబ్బంది కబ్జాకు గురైన 17 గుంటల స్థలాన్ని ప్రభుత్వ భూమిగా పరిగణిస్తూ బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాండూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని విజయ విద్యాలయ పాఠశాల పక్కన ఆక్రమణకు గురైన 17 గుంటల భూమి సర్వే నంబర్ 111కు చెందింది. ఈ సర్వేనంబర్ ప్రభుత్వ భూమి 1954–55 ఖాస్రా పహణీ నుంచి ప్రస్తుత రికార్డుల వరకు సర్వే నంబర్ 111లో ప్రభుత్వ భూమిగానే ఉంది. ఈ సర్వే నంబర్‌లో 14 ఎకరాల 14 గుంటల భూమి ఉందని, అందులో రెండు దశాబ్దాల క్రితం మినీ స్టేడియం కోసం కేటాయించడం జరిగిందన్నారు. మినీ స్టేడియం ప్రాంగణంలోనే ఆర్డీఓ కార్యాలయం కొనసాగుతున్నట్లు గుర్తు చేశారు. కొంతభాగం విజయవిద్యాలయ పాఠశాల, ఆర్‌అండ్‌బీ రోడ్డుతో పాటు కొంత భూమిలో ఇళ్లు నిర్మించుకున్నారు. పసారం లలిత్ సందీప్, శశాంక్‌తో పాటు ఇతరులు కోర్టులో మధ్యంతర ఉత్తర్వుల ప్రకారం భూమికి ఫెన్సింగ్ చేసి బోర్డు పెట్టారన్నారు. పసారం కుటుంబ సభ్యులు పెట్టిన బోర్డును తొలగించి ప్రభుత్వ భూమిగా బోర్డు పట్టడం జరిగిందన్నారు. కోర్టులో అంతిమ తీర్పు వెలువడే వరకు ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటుందన్నారు.

### కపిలేశ్వరస్వామికి అన్నపూజ



ధారూరు: మండల కేంద్రంలో వెలసిన నందీశ్వరుడికి ధారూరు చెందిన సతీష్‌పటేల్ మంగళవారం 108 టెంకాలయ సమర్పణ చేశారు. తను కోరుకున్న కోరిక తీరడంతో 108 టెంకాయలను కొట్టినట్లు చెప్పారు. అలాగే, పరిగి పట్టణానికి చెందిన కల్వ వీరప్ప కపిలేశ్వరస్వామికి అన్నపూజ చేశారు. అంతకుముందు శివలింగానికి జలాభిషేకం, పాలాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

### నేడు కంకల్‌కు ఎమ్మెల్యే రాక

పూడూరు: మండల పరిధిలోని కంకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే పాఠశాల రీ ఓపెనింగ్ కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పాల్గొంటారని ఎంపీడీఓ పాండు తెలిపారు. బుధవారం ఉ.11 గంటలకు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

### నేడు పుస్తకాల పంపిణీ

ధారూరు: మండల పరిధిలోని కేరెళ్లి పాఠశాలలో బుధవారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, దుస్తువులను పంపిణీ చేయనున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 1 గంటకు జరిగే ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రజలు హాజరు కావాలని ఆయన కోరారు.

### నేడు యాలాలకు కొండా

యాలాల: చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నేడు(బుధవారం) యాలాల మండలానికి రానున్నారు. ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా అధ్యక్షతన జరగనున్న మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎంపీ ముఖ్య అతిథిగా రానున్నారు. ఎంపీగా గెలిచిన అనంతరం కొండా మొదటిసారిగా యాలాలకు వస్తుండటంతో ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. అలాగే, ఎంపీపీ హోదాలో బాలేశ్వర్ గుప్తాకు ఇదే చివరి సర్వసభ్య సమావేశం, అనంతరం బాలేశ్వర్‌గుప్తా పాలన గడువు ముగియనుంది. మండల పరిషత్ సమావేశంలో ఉ.11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు.

### ఎస్‌బీఐలో ఉద్యోగాలు

అనంతగిరి: ఎస్‌బీఐ కార్డు (థర్డ్ పార్టీ రోల్)లో సుమారు 50 ఉద్యోగాలు ఉన్నాయని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సుభాన్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉ.10.30గంటలకు వికారాబాద్‌లోని ఐటీఐ కాలేజీ క్యాంపస్‌లో జాబ్‌మేళా ఉంటుందన్నారు. ఏదైనా డిగ్రీ చదివి ఉండాలన్నారు. అర్హులైన వారు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9676047444లో సంప్రదించాలన్నారు.

### ఎంపీని కలిసిన ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు



ఎంపీని కలిసిన నాయకులు

అనంతగిరి: ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని మంగళవారం ఎంఎస్పీ, యంఆర్‌పీఎస్ నాయకులు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యంపీకి పూలమాలలు, శాలువాలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్, ప్రధాన కార్యదర్శి స్వామిదాసు, సుభాష్, నరసింహ, శంకర్, మోహన్, బాబురావు, రవికుమార్, శ్రీనివాస్, భరత్ తదితరులు ఉన్నారు.

# వేసవి సెలవులకు బై..బై..



వీధిలో క్రికెట్ ఆడుతున్న చిన్నారులు

నేడు మోగనున్న బడిగంట

దుద్యాల్ : వేసవి సెలవులు రావడంతో విద్యార్థులు విహారయాత్రలకు, బంధువుల గ్రామాలకు, దైవదర్శనాలకు వెళ్లి సంతోషంగా గడిపినారు. మరికొందరు కుటుంబ సభ్యులకు పనుల్లో చేదోడువాదోడుగా ఉన్నారు. వేసవి సెలవులు మంగళవారంతో పూర్తివ్వడంతో బుధవారం నుంచి పాఠశాలలకు వెళ్లాలనే ఉత్సాహంలో చిన్నారులు ఉన్నారు. ఇక ఆటలకు, పనులకు స్వస్తి పలికి బుద్ధిగా పాఠశాలకు వెళ్లాలని చిన్నారులకు తల్లిదండ్రులు బుజ్జగింపులు చేసే పనిలో ఉన్నారు.

# పూర్తి కావస్తున్న పాఠశాలల పనులు



ఇందాపూర్ పాఠశాలలో నిర్మించిన టాయిలెట్

దౌల్తాబాద్: మండలంలోని 41 పాఠశాలల్లో అమ్మఆదర్శ పాఠశాలల (ఏఏపీసీ) కమిటీలతో చేపట్టిన పనులు పూర్తి కావస్తున్నాయి. పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా అన్ని పాఠశాలల్లో కనీస వసతులు కల్పించాలనే లక్ష్యంతో పనులు ప్రారంభించారు. అమ్మఆదర్శ కమిటీలతో పేరుతో స్థానిక మహిళ సంఘాల గ్రామైక్య కమిటీ అధ్యక్షుడితో పనులు చేయించారు. అందులో నాలుగు విభాగాలుగా విభజించి విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, మైనర్ మరమ్మతుల పేరుతో పనులను చేపట్టింది. నేడు పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మండలంలో 41 పాఠశాలల్లో చేపట్టిన పనులు 80శాతం పూర్తయ్యాయి. ఈ పనులను ఎంపీడీఓ విజయలక్ష్మి పర్యవేక్షిస్తున్నారు.

# సర్వర్ రాక .. సర్వే కాక

ఆందోళనలో పంచాయతీ కార్యదర్శులు




సర్వే చేస్తున్న పంచాయతీ కార్యదర్శి శ్రావణ్

పెద్దేముల్: గ్రామ పంచాయతీల్లో మిషన్ భగీరథ నల్లాల కలెక్షన్లపై నిర్వహించే ఇంటింటి సర్వేలో సర్వర్ సక్రమంగా రాక... సర్వే పూర్తికాక పంచాయతీ కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. మంగళవారం మండలంలోని మంబాపూర్, తట్టిపల్లి, మారేపల్లి, బుద్దారం, అడ్కిచెర్ల, గోట్లపల్లి, బండపల్లి, ఖాణాపూర్, గోట్లపల్లి, గిర్మాపూర్ గ్రామాలల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో పాటు ఐకేపీ సిబ్బంది నల్లాల కనెక్షన్లపై సర్వే నిర్వహించారు. వారంలో సర్వే పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో పంచాయతీ కార్యదర్శులు గ్రామాలకు ఉదయం వెళ్లి సర్వే మొదలు పెట్టగా సర్వర్ సక్రమం రావడం లేదని వాపోతున్నారు. ఉదయం 11.30 నిమిషాల నుండి సర్వర్ పూర్తిగా పనిచేయడం లేదని మండల ఎంపీఓ రమేష్ తెలియచేశారు. మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో మొత్తం 13,721 మిషన్ భగీరథ కనెక్షన్‌లు ఉన్నాయి. మంగళవారం నాడు కేవలం 425 నల్లాల కనెక్షన్లపై సర్వే పూర్తియిందని ఎంపీఓ చెప్పారు. ఏది ఏమైన వారంలో సర్వే పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

# రైతన్న బిజీబిజీ

కూలీలకు చేతి నిండా పని



హంసన్‌పల్లిలో పత్తి విత్తనాలు నాటుతున్న మహిళలు



విత్తనాలు నాటేందుకు అచ్చులు వేస్తున్న రైతు

దుద్యాల్: రైతులు వానాకాలం సాగు పనుల్లో బిజీబిజీ గడుపుతున్నారు. రెండు రోజుల క్రితం మండలవ్యాప్తంగా ఓ మోస్తారు వర్షం కురవడంతో దుక్కులు దున్ని రైతులు పత్తి విత్తనాలు నాటిస్తున్నారు.. మరికొందరు ట్రాక్టర్లతో దుక్కులు దున్నుకుంటున్నారు. కొందరు విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. ఏ పొలంలో చూసినా పత్తి నాటే కూలీలు, ట్రాక్టర్లతో దుక్కులు దున్నడం, అచ్చులు తోలుకునే రైతులు కనిపిస్తున్నారు. వ్యవసాయ పనులు మొదలు కావడంతో కూలీలకు చేతినిండా పని దొరుకుతుంది.

# క్రీడల్లో గెలుపోటములు సహజం



ట్రోఫీని అందజేస్తున్న రాజేశ్వరమ్మ

కేఎస్‌ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ

దోమ : క్రీడలు మానసికోల్లాసం, శారీరక ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతాయని కేఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ అన్నారు. సోమ వారం మండల పరిధిలోని మోత్కుర్ గ్రామంలో గత కొన్ని రోజుల నుంచి జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్‌కు చేరడంతో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై వీక్షించారు. ఈ క్రీడల్లో మోత్కుర్, మల్కాపూర్ జట్టు తలపడగా మల్కాపూర్ జట్టు విజయం సాధించింది. అనంతరం ఆమె మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. స్నేహపూర్వకంగా క్రీడలను ఆడుకోవాలని, క్రీడల్లో గెలుపోటములు సహజమని సూచించారు. మొదటి బహుమతి రూ. 30 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, ప్రైజ్ మనీ అందజేసి ట్రోఫీ క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో మోత్కుర్ గ్రామస్తులు లింగయ్య, సుధాకర్, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు

- లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం
- 20 మందికి మెరుగైన చూపు



మాట్లాడుతున్న లయన్స్‌క్లబ్ కార్యదర్శి దాసప్ప

కొడంగల్ : కంటిచూపుతోనే మెరుగైన జీవితం సాధ్యమవుతుందని క్లబ్ సభ్యులు యాదవ్, శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 20 మంది పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ సభ్యులు మాట్లాడుతూ.. నెలలో ఒకసారి ఉచితంగా ఆపరేషన్లు చేయించి మందులు ఇస్తున్నట్లు తెలిపారు. లయన్స్‌క్లబ్ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాసన్ హైకేర్ సంస్థలో పనిచేస్తున్న డాక్టర్ నయన దేశ్‌ముఖ్ కంటి వైద్య శిబిరంలో పాల్గొని రోగులకు పండ్లు, బిస్కట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ సభ్యులు ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో వాసన్ ఐ కేర్ ఏజీఎమ్ మహేశ్వరీ, కొడంగల్ ప్రభుత్వా సుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రప్రియ, డాక్టర్ సాకేత్ తదితరులు పాల్గొన్నారు.